# క్రైం కథ

# అర్ధరాత్రి హత్య?



రాత్రి ఒంటిగంటన్నరకి పోలీస్ స్టేషన్లో ఫోన్ మ్రోగింది. హెడ్ కానిస్టేబుల్ మస్తాన్ రిసీవర్ తీసి 'హలో!' అన్నాడు బద్ధకంగా ఆవులిస్తూ.

'సార్! నేను నిజామ్‌పేట రోడ్డులో ప్లాట్ నెం. 135 నుంచి మాట్లాడుతున్నాను.'

'ఎవరు నువ్వు'. ఏం జరిగింది?'

'మా సార్‌ని ఎవరో మర్డర్ చేశారు.'

మస్తాన్ నిద్రమత్తు వదిలిపోయింది.

'నువ్వు ఎవరు? నీ పేరేంటి?' అడిగాడు మస్తాన్.

'నా పేరు బాలరాజు సార్! నేను ఇక్కడ వాచ్‌మెన్‌ని.'

'మీ సార్ పేరేమిటి?'

'మోహనరావు'

'సరే! నువ్వు భయపడకుండా అక్కడే వుండు. అక్కడ ఏ వస్తువూ ముట్టుకోకు. కొత్త వారు ఎవ రైనా కనిపిస్తే గుర్తుపెట్టుకో.' మస్తాన్, బాలరా జుకి జాగ్రత్తలు చెప్పాడు.

ఆ తర్వాత విషయమంతా ఇన్‌స్పెక్టర్ ప్రతా ప్‌కి ఫోన్‌లో తెలియజేశాడు.

పోలీస్ వ్యాన్ సంఘటనా స్థలానికి చేరుకునే సరికి వాచ్‌మెన్ వణుక్కుంటూ గేటు దగ్గరే నిల బడి వున్నాడు.

'సార్! నేను ఇక్కడ వాచ్‌మెన్‌ని. నా పేరు బాలరాజు' వ్యాన్ దిగుతున్న ఇన్‌స్పెక్టర్‌కి చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ తలవూపి 'జరిగింది చెప్పు.' అన్నాడు.

'అయ్యగారు నన్ను సెకండ్ షో సినిమాకు వెళ్ళమని డబ్బులు ఇచ్చారు. నేను సినిమా చూసి వచ్చేసరికి ఒంటిగంటైంది. నేను వచ్చేసరికి తలుపు తీసి వుంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్ళాను. బెడ్‌రూమ్‌లో అయ్యగారు చనిపోయి ఉన్నారు. నాకు భయం వేసి వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాను.' బాలరాజు వణుక్కుంటూనే అంతా చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ బాలరాజు వైపు సీరియస్‌గా చూశాడు. ఆ తర్వాత బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

మోహన్‌రావు శవం వెల్లకిలా పడివుంది. శరీరం మీద ఎటువంటి గాయాలు లేవు. చని పోయే ముందు బాగా బాధపడినట్లు ముఖంలో కనిపిస్తోంది.

'మీ సార్‌ని ఎవరో మర్డర్ చేశారని చెప్పావు?' చూస్తుంటే ఎవరూ మర్డర్ చేసినట్లు లేదే!' బాల రాజు వైపు అనుమానంగా చూస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

బాలరాజు అయోమయంగా చూశాడు.

'చెప్పు! నువ్వు మర్డర్ అని ఎందుకనుకు న్నావు? మామూలుగా ఏ హార్ట్ ఎటాక్‌తోనో చని పోయి వుండొచ్చుగదా?' అన్నాడు.

బాలరాజుకి ఏం చెప్పాలో తోచక భయం భయంగా ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి చూశాడు.

'మీ సార్ ఏం చేస్తుంటాడు?'

'మా సార్ రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తారు సార్!'

'ఇంట్లో భార్యా పిల్లలు లేరా?'

'ఉహూ.. ఎవరూ వుండరు సార్! సార్‌కి భార్య చనిపోయింది. కొడుకులు అమెరికాలో వుంటున్నారు.'

'నిన్న మీ సార్ పెద్ద మొత్తంలో ఏదైనా డబ్బు తెచ్చాడా?'

తెలీదు సార్!' అన్నాడు బాలరాజు.

మోహన్‌రావు బెడ్‌రూమ్‌లో హేంగర్‌కి తగి లించిన షర్ట్ జేబులో వున్న ఫోన్‌బుక్, డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో దొరికిన సెల్‌ఫోన్ తీసుకు న్నాడు ఇన్‌స్పెక్టర్.

బాలరాజుని మరికొన్ని వ్యక్తిగత వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టమ్ రిపోర్టు కోసం హాస్పటల్‌కి పంపించాడు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్.

* * *

ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ వూహించినట్లే మోహన్ రావుది సహజ మరణమే అని పోస్టుమార్టమ్ రిపోర్టులో వచ్చింది. మా సార్ హార్ట్ ఎటాక్ వల్ల కార్డియాక్ అరెస్ట్ జరిగి ప్రాణం పోయిందని వుంది.

కానీ తమ సార్‌ని ఎవరో మర్డర్ చేశాడని వాచ్‌మెన్ పోలీసు స్టేషన్‌కి ఎందుకు ఫోన్ చేశా డనే ప్రశ్న ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ మనసులో తొలు స్తోంది. సినిమా చూసి వచ్చిన వాచ్‌మెన్ చచ్చిపడివున్న యజమానిని సడెన్‌గా చూసి ఎవరో మర్డర్ చేసి వుంటారని భ్రమపడి వుంటాడా? లేక ఎవరైనా శత్రువులు లోగడ మోహన్‌రావుని నీ అంతు చూస్తామని బెదిరించడం వాచ్‌మెన్ గమనించి వుంటాడా? ఇన్‌స్పెక్టర్ అన్ని కోణాల నుంచి ఆలోచించసాగాడు.

'సార్ ! రజాక్ అట సార్! మిమ్మల్ని కలుసు కోవాలంటున్నాడు' సెంట్రీ వచ్చి చెప్పాడు.

'రమ్మను'

రజాక్ విష్ చేసి 'సార్! మోహన్‌రావు నాకు బిజినెస్ పార్టనర్.' అన్నాడు.

'ఐసీ! ప్లీజ్ టేక్ యువర్ సీట్.' అన్నాడు ఇన్ స్పెక్టర్ ప్రతాప్.

రజాక్‌వైపు పరిశీలనగా చూశాడు. అతనికి ఏభై సంవత్సరాల వయసుంటుంది. మనిషి ఎత్తుగా దృఢంగా ఉన్నాడు. ఖరీదైన రోల్డ్‌గోల్డ్ ఫ్రేమ్ అద్దాలు, షేర్వాణీలో సంపన్న కుటుంబీకు డిలా కనిపిస్తున్నాడు.

'చెప్పండి. మోహన్‌రావుకి లోగడ హార్ట్ ప్రాబ్లమ్ ఏమైనా వుందా?' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

'ఆ విషయం నాకు తెలియదు సాబ్! నిన్న ఒక బిజినెస్ డీల్ జరిగింది. నల్లగళ్ళలో మేము లోగడ కొన్న యల్ఐజీ ఫ్లాట్ ఒక పార్టీకి అమ్మేసి రిజిస్ట్రేషన్ చేశాం. ఆ డబ్బు అతను బ్యాంక్‌లో వేశాడో లేక తన దగ్గరే వుంచుకున్నాడో తెలీదు.' చెప్పాడు రజాక్.

'ఆ డబ్బు ఎంత వుంటుంది?'

'నేను, మోహన్‌రావు ఫిఫ్టీ, ఫిఫ్టీ పార్ట్‌నర్స్. మొత్తం ముప్పై ఆరు లక్షలు వచ్చింది. అందులో పద్దెనిమిది లక్షలు అతని దగ్గర వుండాలి.' చెప్పాడు రజాక్.

'ఐతే మోహన్‌రావు బ్యాంక్ ఖాతాలు వెరిఫై చేస్తే అతను డబ్బు డిపాజిట్ చేసిందీ లేనిదీ తెలు తుంది. ఒకవేళ అతను డబ్బు డిపాజిట్ చేసి వుంటే ఇది సహజ మరణమని మేము కేసు క్లోజ్ చేసేయవచ్చు.' అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్.

తలవూపాడు రజాక్.

'మోహనరావు పర్సనల్ బ్యాంక్ ఖాతాలు ఎక్కడెక్కడున్నాయో మీకు తెలిసే వుంటుంది.' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

రజాక్ చెప్పాడు.

రజాక్‌తో కొన్ని విషయాలు మాట్లాడి పంపించి వేశాడు ఇన్‌స్పెక్టర్. తర్వాత మోహన్‌రావుకి ఖాతాలు వున్న బ్యాంక్ మేనేజర్లతో అతని ఎకౌంట్ చెక్ చేయించాడు. అతడు చనిపోయిన రోజు అసలు ఏ బ్యాంకులోనూ డబ్బు డిపాజిట్ చెయ్యలేదు.

ఐతే ఖచ్చితంగా ఆ డబ్బు మోహన్‌రావు ఇంట్లోనే అట్టే పెట్టుకోని వుంటాడు. ఆ సంగతి కనిపెట్టిన అతని డ్రైవర్‌కాని, వాచ్‌మెన్‌గాని డబ్బు కొట్టేసి వుండొచ్చు. మొత్తానికి ఇంటి దొంగల పనై వుంటుంది. ఇది హత్య కేసు కాదు. దొంగతనం కేసు మాత్రమే అని నిర్ధారణకి వచ్చాడు ఇన్‌స్పెక్టర్.

* * *

మోహనరావు కారు డ్రైవర్ నరేష్, వాచ్‌మెన్ బాలరాజు పోలీస్ స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ ముందు వణుక్కుంటూ నిల్చున్నారు.

'మర్యాదగా చెప్పండ్రా! మీ సారు సూట్ కేసులో డబ్బు తెచ్చాడు కదూ! ఆ సంగతి మీకూ తెలుసు కదూ?' కోపంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

'మాకేం తెలీదు సార్!' కోరస్‌గా అన్నారు ఇద్దరూ.

'వీళ్ళిట్లా చెప్తారా సార్! మన మర్యాదలు రుచి చూపించాల్సిందే. అప్పుడు కాని నిజం చెప్పరు.' అన్నాడు యస్ఐ కుమార్.

'దేవుడి తోడు సార్! సార్ డబ్బు సంగతి నాకు తెలీదు. మీరు ఎవర్నయినా అడగండి. సార్ దగ్గర నేను ఐదేళ్ళ నుంచి పని చేస్తున్నాను. ఇంట్లో చిన్న దొంగతనం చెయ్యలేదు. అవసరమున్న ప్పుడు సార్‌ని అడిగితే డబ్బు ఇస్తాడు సార్!'' అన్నాడు బాలరాజు.

'సార్ వెంట ఎప్పుడూ సూట్ కేసు వుంటుంది సార్! అందులో ఎక్కువగా కాగితాలు వుంటాయి. అప్పుడప్పుడు డబ్బు వుంటుంది. నేనెప్పుడూ పట్టించుకోను సార్! ఆయనకి ద్రోహం చెయ్యాలని ఎప్పుడూ అనుకోలేదు.' చెప్పాడు డ్రైవర్ నరేష్.

'మీ మాటలు నమ్ముతున్నా! కానీ ఒక విషయం చెప్పాలి. అప్పుడప్పుడూ మీ సార్ నిన్ను సెకండ్ షో సినిమాకి ఎందుకు పంపి స్తాడు? ఆ టైమ్‌లో ఇంటికి ఎవరైనా వస్తారా? నిజం చెప్పండి.''

ఇద్దర్నీ వుద్దేశించి అన్నాడు ఇన్‌స్పెక్టర్.

డ్రైవర్ ఏం మాట్లాడలేదు.

'సార్ కోసం ఎవరో ఆడవాళ్ళు వస్తారని మా

పక్క బిల్డింగ్ వాచ్‌మెన్ చెప్పాడు సార్. నేనైతే ఎప్పుడూ చూళ్ళేదు. నాకు ఆ వచ్చే వాళ్ళు ఎవరో తెలియగూడదని సార్ అనుకుని వుండొచ్చు. అందుకే నన్ను సెకెండ్ షో సినిమాకి వెళ్ళి రమ్మని పంపిస్తూ వుండొచ్చు.'

బాలరాజు మాటల్లో నిజాయితీ వున్నట్లు ఇన్‌స్పెక్టర్ గ్రహించాడు. మోహన్‌రావుకి భార్య లేదు. అప్పుడప్పుడు ఆడవాళ్ళని పిలిపించుకుంటూ వుండొచ్చు. కానీ వాచ్‌మెన్‌కి తెలియకుండా ఎందుకు? తెలిస్తే ఏమవుతుంది? ఒకవేళ ఆ లొకాల్టీలో ఉన్న ఏ సంసార స్త్రీతోనైనా మోహన్‌రావుకి అక్రమ సంబంధం వుందా? అందుకే వాచ్‌మెన్‌కి తెలియకూడదని అనుకుంటున్నాడా?

కొందరు తమ ప్రైవేటు కార్యకలాపాలు పని వారికి తెలియగూడదని అనుకుంటారు. అలా తెలిస్తే వారికి తామంటే చిన్నచూపు ఏర్పడు తుందనీ, గౌరవం వుండదనీ భావిస్తారేమో?

ఇన్‌స్పెక్టర్ ఆలోచనలో పడిపోయాడు.

'సరే! మీరు వెళ్ళండి. ఊరు వదిలిపెట్టి వెళ్ళకండి. నేను కబురు చేసినప్పుడు రావాలి.' అన్నాడు.

వాళ్ళిద్దరి మొఖాల్లో రిలీఫ్ కనిపించింది.

'మీ సార్‌ని ఎవరూ మర్డర్ చేయలేదు. హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడు. మీరు అనవసరంగా భయపడకండి. ఇకపోతే డబ్బు మాత్రం పోయింది. ఇల్లంతా గాలించినా ఎక్కడా దొరకలేదు. కాబట్టి ఎవరో దొంగిలించారు. అది తేలాలి. అప్పటి వరకు మీరు కూడా అనుమానితులే! గుర్తుంచుకోండి. అలాగే మీకు ఎవరిమీదైనా అనుమానం వుంటే కూడా చెప్పండి.' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరూ తలలు వూపారు. నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు.

'సార్ ! వీళ్ళని వదిలేశారేంటి? సెల్లో పడేసి బాదితే ఏవైనా బైటికి వస్తుందేమో?' అన్నాడు యస్ఐ కుమార్.

'ఆ డబ్బు సంగతి వీళ్ళకు తెలీదు. ఇందులో ఎవరికి ఆ డబ్బు దొరికినా వుండేవాళ్ళు కాదు. ఎటైనా చెక్కేసే వారు.' ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ అన్నాడు.

'సార్ ! ఒకవేళ మోహన్‌రావు పార్ట్‌నర్ రజాక్ అసలు డబ్బు ఇచ్చివుంటాడా? పార్ట్‌నర్ చనిపో యాడు గనుక ఇచ్చేశానని అంటున్నాడా?' సందేహం వెలిబుచ్చాడు యస్ఐ.

'ఆ డబ్బు విషయం చెప్పిందే రజాక్. డబ్బు ఇవ్వకుండా ఇచ్చానని బుకాయించాల్సిన అవ సరం అతనికి ఏముంది? ఐనా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇద్దరూ కలిసి కోట్లలో టర్నోవర్ చేస్తున్నారు. ఇంత చిన్న ఎమౌంట్ గురించి రజాక్ కక్కుర్తి పడాల్సిన అవసరం అతనికి లేదు. రజాక్‌ని అనుమానించలేం' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

యస్ఐ వెళ్ళిపోయిన తర్వాత మోహన్‌రావు ఇంట్లో నుంచి కలెక్ట్ చేసిన సెల్‌ఫోన్ గుర్తొచ్చింది. మోహన్‌రావు చివరిసారి ఎవరికి ఫోన్ చేసి వుంటాడు? ఏదైనా క్లూ దొరకొచ్చని అనిపించింది.

సెల్ తీసుకుని మోహన్‌రావు చేసిన ఆఖరి నెంబర్‌కి రింగ్ చేశాడు.

'హలో సార్! నేనిప్పుడు బెంగుళూర్లో వున్నా! చెప్పండి సార్! రాత్రికి ఎవర్నైనా అరేంజ్ చేయ మంటారా?'

ఇన్‌స్పెక్టర్ పెదవులపై చిరునవ్వు మెదిలింది. వీడెవడో అమ్మాయిల బ్రోకర్. మోహన్‌రావుకి అమ్మాయిల్ని సప్లయ్ చేసేది వీడే. మోహన్‌రావు చనిపోయిన రాత్రికూడా ఎవరో అమ్మాయిని వీడే పంపివుంటాడు. చిక్కుముడి వీడిపోతున్నట్లుగా అనిపిస్తోంది ఇన్‌స్పెక్టర్‌కి.

'నీ పేరేంట్రా?' కఠినంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

'సార్! మీరెవరు?.. మోహన్‌రావు గారు కాదా?' కంగారుగా పలికింది అతని కంఠం.

'ఇన్‌స్పెక్టర్ ప్రతాప్'

'సార్! మీరా!'

'ఔను. నేను నీకు తెలుసా?'

'మీరు తెలియకపోవడం ఏమిటి సార్! నాకు బాగా తెలుసు.'

'ఐతే విను. నువ్వు అర్జెంట్‌గా హైదరాబాద్ వచ్చి నన్ను కలువు. వెరీ అర్జంట్.'

'సార్! ఏమిటి సార్? ఎందుకు సార్?' అతని కంఠంలో భయం ధ్వనిస్తోంది.

'నువ్వు మోహన్‌రావు దగ్గరికి పంపిన కాల్‌గర్ల్ ఎవరో అతణ్ణి మర్డర్ చేసి డబ్బు తీసుకుని పారిపో యింది.' చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

'మై గాడ్. మోహన్‌రావు గారిని మర్డర్ చేసిందా? డబ్బు తీసుకుని పారిపోయిందా? ఎంత సార్?'

'పద్దెనిమిది లక్షలు. నువ్వు తెల్లారేసరికి నా ముందు వుండాలి. ఓ.కే ఇంతకీ నీ పేరేంట్రా? చెప్పనే లేదు.'

'నా పేరు నాగరాజు సార్!'

'సరే! ఇక బయల్దేరు.' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

మర్నాడు ఉదయం పదింటికల్లా నాగరాజు పోలీస్ స్టేషన్‌కొచ్చి ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ కాళ్ళ మీద పడిపోయాడు.

'ఈ నంగివేషాలు నాకు నచ్చవ్. చెప్పు. ఆ రోజు రాత్రి మోహన్‌రావు దగ్గరికి పంపిన అమ్మాయి ఎవరు?' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

'స్మిత సార్!'

'ఎక్కడుంటుంది?'

'యూసుఫ్‌గూడా చెక్‌పోస్టు దగ్గరే ఒక అపార్ట్ మెంట్‌లో వుంటుంది.'

'ఏం చేస్తుంది. ఏదైనా జాబా?'

'కాదు సార్! సినిమాల్లో, టీవీల్లో వేషాలు వేస్తుంటుంది.' చెప్పాడు నాగరాజు.

'సరే! పద' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

పోలీసులు వెళ్ళేసరికి స్మిత మేకప్ ముగించు కుని షూటింగ్‌కి వెళ్ళడానికి రెడీ అవుతోంది.

'స్మితా ! డబ్బెక్కడ పెట్టావో చెప్పమ్మా!' నవ్వుతూ అడిగాడు ఇన్‌స్పెక్టర్.

'ఏం.. డబ్బు?' కంగారుపడుతూ అడిగింది.

'మోహన్‌రావు ఇంట్లో నుంచి తెచ్చిన డబ్బు' అన్నాడు.

కానిస్టేబుల్స్ ఇల్లంతా గాలించేసరికి డబ్బు బైటపడింది. తన బెడ్‌రూమ్‌లో బెడ్‌క్రిందనే దాచింది. డబ్బు బైటపడేసరికి స్మిత నిజం ఒప్పు కుంది.

'మోహన్‌రావు గుండె పట్టుకుని బాధపడు తుంటే నాకు భయం వేసింది. ఆయన బెడ్ మీద కొట్టుకుంటున్నప్పుడు అంతా కదిలిపోయి బ్రీఫ్ కేసు బైటపడింది. నేను తెరిచి చూశాను. దాన్నిండా డబ్బుంది. నాకు అంత డబ్బు చూసేస రికి కళ్ళు తిరిగాయి. ఆశ కలిగింది. ఇంతలో ఆయ నలో చలనం ఆగిపోయింది. నేను అక్కడికి వచ్చి నట్లు ఎవరికీ తెలిసే అవకాశం లేదు. ఇంట్లో పని వాళ్ళు కూడా లేరు. నేను బ్రీఫ్ కేస్ తీసుకుని వచ్చే శాను.' చెప్పింది స్మిత.

